మూలం : టాల్‌స్టాయ్ !

"దాగని సత్యం"

శ్రీ అడవి కనకరాజు

ఆక్సెనోవ్ భార్య కతడంటే ప్రాణం.

ఆక్సెనోవ్ భార్య, అతడు బూట్లుదులుపు కుంటూంటే ప్రక్కన నిలబడి అన్నది. "మీరీ వారం సంతకు వెళ్ళకండి! రేపు వలసిన సరుకులు పట్నంలో తెచ్చుకోవచ్చు. నా మాట వినండి!"

అతడామె ముఖంలో కదోలా చూశాడు. అంతవరకూ అతనిలో రేగిన ఉత్సాహం క్షణ కాలం నిశ్చేష్టితమైంది.

"ఏం? ఆదేం? ప్రతివారం వెళ్తున్నానుగా! అల్లాగంటున్నావేం?" అని అడిగాడామెను.

ఆమె దీనంగా ముఖం పెట్టి అతడికేసి చూసింది. అతడు బూట్లు దులుపుకోటం క్షణం ఆపి, ఆమెముఖంలోని వేదనకుకారణం ఊహించటానికి ప్రయత్నించాడు.

"రాత్రినాకు కలవచ్చింది. అందులో మీరు నెరసినజుట్టుతో ఏదో అపదలో ఉన్నట్టు కన్పించారు. ఎందుకో నా హృదయం క్షోభిస్తోంది. ఏదో అపశకునం నా మనస్సును కలవరపెడ్తోంది. వద్దు వెళ్ళకండి!"

ఆమె ముఖంలో ఆవేదన అంతకంతకు అధిగమించి పోయింది. ఆమెవచ్చి, అతని చేతిలోని బూట్లు గట్టిగా పట్టుకుంది. ఆమె మాటలు విని కేవలంగా ఒక చిరునవ్వు నవ్వాడు.

"పిచ్చిదానా! ఈ మాత్రానికే ఇంత కలవర పడ్డావెందుకూ? కలల కర్థం పర్థం లేదని తెలుసుకో. ఏమీబాధ పడకు. రేపు సాయంత్రాని కల్లా వచ్చేస్తాగా!" అతడు మెల్లిగా ఆమెను బుజ్జగించాడు. కాని ఆమె వేదన ఏమంతగా తగ్గలేదు.

"ఐనాఎందుకు? పోనీ మానెయ్యకూడదూ? పోనీ నామీదనన్నా కనికరం ఉంచండి! నా మాట వినండి."

"కాదు ఏదో అర్థంలేని కలల్ని ఆధారంగా చేసుకొని అపశకునం అంటావేమిటి వెర్రిదానివి! నేనీ రోజున ఎంత ఉత్సాహంగా ఉన్నానో తెలుసా! రేపు సాయంత్రానికి నీకు సిల్కు చీరా, బుజ్జిగాడికి సూటు తీసుకు వద్దామని నిన్నటినుంచీ కలలు గంటున్నాను. బాధ పడకు!" అని భార్య నూరడించాడు. ఆమె తిరిగి మారు పలుకలేక అల్లాగే నిలబడి పోయింది.

అతడు కులాసాగా ఈలవేసుకుంటూ పనులన్నీ ముగించుకున్నాడు. కోచ్ సిద్ధం చెయ్యమని నౌకరును కేకేశాడు. క్షణంలో కోచ్ వచ్చి గుమ్మంలో నుంచుంది. అతడు భార్య సమీపంగా వెళ్ళి "ఎందుకంత బాధ చెప్పు! మరివస్తా! సంతోషంగా ఉండు!" అని ఆమె గడ్డం నిమిరాడు. ఆమె నయనాల్లో నిలచిన రెండశ్రుబిందువుల్ని అతడు కళ్ళారా చూచాడు. ఆమె బేలతనానికి విచారించాడు. ఆమె దీన వదనంతో మెట్లమీద నిలబడి కోచ్ పోయిన దిక్కుకు అది అదృశ్య మయ్యేదాకా

చూచింది. తరువాత అశ్రుపూరిత నయనాల్ని వత్తుకుంటూ మెల్లిగా అడుగులు వేస్తూ లోపలికి వెళ్ళి పోయింది. అక్సెనోవ్ ఆమె చర్యల్ని చూసి "పాపం! బేల!" అనుకున్నాడు మనస్సులో.

అక్సెనోవ్‌కు ఆ కుగ్రామంలో రెండుభవనాలు, ఒక అంగడీ ఉన్నాయి. వాటి మీద లభించే ఆదాయంతో అతడు భార్యా బిడ్డలతో చాలా ఖులాసాకాలం గడుపుతున్నాడు. ప్రతి వారం అతడు సమీపానఉన్న పట్నపు సంతలో తన అంగడికి కావలసిన సామగ్రి ఖరీదు చేసి తెచ్చుకోవటం అలవాటు. ఈ పర్యాయం కూడా అతడట్లాగే సంతనాటికి ముందురోజు సాయంత్రం గుర్రపు బగ్గీలో ప్రయాణం అయ్యాడు.

గుఱ్ఱపు గిట్టలు ఒక లయలో మధురంగా వినవస్తున్నాయి, అక్సెనోవ్ సన్నగా ఈల వేస్తూ, మరుసటిరోజు సంతలో తను కొనబోయే జాబితా మననం చేసుకుంటున్నాడు లోలోపల.

కోఛ్‌వాలా ఏదో పాట పాడుతున్నాడు. కోఛ్ పచ్చటి పైరు పొలాలమధ్య తెల్లత్రాచులా మెలికలు తిరిగిపోయే రహదారిననుసరించి, సామాన్య వేగంతో సాగిపోతోంది. అక్సెనోవ్ హఠాత్తుగా, క్రమక్రమంగా వెనక్కు జారుకునే బాటని చూస్తూ ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు.

చీకటి పడేటప్పటికి బండి ఒకపల్లెకు చేరింది. అక్సెనోవ్ అక్కడ ఒక సత్రంలో బస చెయ్యదల్చుకున్నాడు. ఆ సత్రంలోనే పట్నం పోయే వర్తకులంతా బస చేసే అలవాటుంది. రాత్రి గుఱ్ఱాన్ని సావడిలో కట్టించి, తను గదిలో కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు. తనకి వలెనే సంతకు బయలుదేరిన మరొక వర్తకుడు తన గదిలోకి వచ్చి పలకరించాడు అక్సెనోవ్ అతనితో కాలక్షేపం చెయ్యాలనుకున్నాడు. రాత్రిపన్నెండైనాక. వారిద్దరూ సంభాషణ ముగించి, తమ తమ గదుల్లో నిద్రించారు.

ఇంకా తెల్లవారలేదు. మసకచీకటిలో మంచు తెరలు తేలియాడుతున్నాయి. మంచు భారానికి గడ్డి మొక్కలు కొలదిగా స్పందిస్తున్నాయి. అక్సెనోవ్ అలవాటు ప్రకారం వేకువనే లేచి, స్నానానంతరం బగ్గీకట్టించి, సత్రపు యజమానికి సుంకం చెల్లించి ప్రయాణమయ్యాడు.

బండీ పట్నం చేరింది. అక్కడ మరొక సత్రంలో అతడి బస ఏర్పాటైంది. అక్సెనోవ్ చాలా ఉత్సాహంగా ఉన్నాడు. బండి గుఱ్ఱాన్ని కట్టి కోచ్‌వాలాని పంపించి, తను కుర్చీలో కూర్చున్నాడు. కొద్ది క్షణాలు గడిచాయి. అతడి వీనులకు ఏవో బూట్ల ధ్వనులు వినవచ్చాయి. ఆ ధ్వని క్రమక్రమంగా తనగదివైపే వస్తోంది. వచ్చేసింది. ఇద్దరు పోలీసులు,మరొక అధికారి గబగబా అతడి గదిలో ప్రవేశించారు. అక్సెనోవ్ తెల్లబోయి నిలబడి చూస్తున్నాడు. అతడి ఉత్సాహమంతా క్షణంలో మాయమైంది.

"ఎక్కణ్నుంచి వస్తున్నారు మీరు?" అని అడిగాడు అధికారి. అక్సెనోవ్‌కి ఏమీ అర్థం కాలేదు. ప్రక్క పల్లెనించి వస్తున్నట్లుగా తెలిపాడు.

"రాత్రి మీ బసఎక్కడ?" మొదలైన ప్రశ్న పరంపరతో అక్సెనోవ్ తబ్బిబ్బయిపోయాడు. మెల్లిగా అన్నింటికీ సమాధానాలిచ్చాడు. అప్పుడా అధికారి చెప్పాడు.

"రాత్రి మీ ప్రక్క గదిలోని వర్తకుడొకడు హత్య చెయ్యబడ్డాడు. అతడు రాత్రి పన్నెండు గంటలవరకూ మీతో గడిపాడని సత్రపు యజ

మాని చెప్పాడు. మీ సామాను సోదా చేయాలి."

హత్య అనేటప్పటికి ఆక్సెనోవ్ ఉలికిపడ్డాడు. తను హంతకుడా? అతడి శరీరం కంపించింది. ఒక్కసారిగా అతనే పాతాళంలోకి క్రుంగిపోతున్నట్లుగా భావించాడు. అతడి ముఖం వికారంగా తయారైంది.

"క్షమించాలి... నేనేమీ ఎరగను. అతడు రాత్రి పన్నెండు గంటలవరకూ నాతో గడిపిన మాట వాస్తవమే. తరువాత నేనాతడ్ని చూడలేదు." ఇంతలోకే ఒక రక్షకభటుడతని సంచీ పరికించాడు. అందులోనుంచి ఒక కైజారు బైటకు తీశాడు. దానిమీద రక్తపు మరకలున్నాయి.

ఆక్సెనోవ్ చేష్టలుడిగి పోయాడు. అతని హృదయం వేగంగా కొట్టుకొంటోంది. అతడికే క్షణంలో ఏం జరగబోతుందో అంతా అయోమయంగా ఉంది. లేడి పిల్లలాగ అతడు భయకంపితుడౌతున్నాడు. తన సంచిలోకి రుధిరమయమైన కత్తి రావటానికి కారణమేమిటో ఊహించుకోలేనంతగా భయపడుతున్నాడతడు.

మరొక కొద్దిక్షణాలు గడిచాయి. ఆక్సెనోవ్ క్రౌర్యానికి లోనయాడు. అతని చేతుల్ని బంధించి, తమతో తెచ్చిన బండిలో కారాగారానికి తీసుకుపోయారు అధికారులు.

కొద్ది క్షణాలక్రితం అతడెక్కడున్నాడు? అప్పటి వుత్సాహం అంతా ఇప్పుడేమైపోయింది? ఆక్సెనోవ్ దీర్ఘంగా నిట్టూర్పులు విడుస్తూ ఆలోచిస్తున్నాడు. తన భార్య కండ్లల్లో మెరిసిన కన్నీటి చుక్కలతని నయనాలముందు తళతళలాడాయి.

న్యాయస్థానంలో విచారణ జరిపారు. నేరం దృఢపడింది. ఆక్సెనోవ్ మాట్లాడలేదు. భగవంతుడికి సత్యం తెలుసు. అతడే సత్యస్వరూపుడు. అతడా భగవంతుణ్ణి నమ్ముకున్నాడు. కాని,... అతడికి యావజ్జీవ కారాగృహవాస శిక్ష వేశారు. అతడు మెల్లిగా ప్రక్కకు తిరిగి కండ్లు వత్తుకున్నాడు. ఇంటివద్ద భార్య, బిడ్డలూ అతని కళ్ళముందు విలపిస్తూ గోచరించారు. అతడు చేయగలిగింది లేదు. భగవంతుడు సత్యస్వరూపుడు.

అతడు కారాగృహంలో ఉండగా, సంగతి తెలిసి, భార్యా, బిడ్డలూ అతడ్ని చూచిపోవడానికి వచ్చారు. అతడి భార్య అతడిముందు అవనత శిరస్సుతో బొట బొటా కన్నీళ్ళు రాల్చింది. కొన్ని క్షణాల తరువాత ఆమె నీరస స్వరంతో ప్రశ్నించింది.

"నిజంగా మీరా హత్య జరిపారా?"

ఆక్సెనోవ్ హృదయం తరుక్కుపోయింది. జీవితంలో సగభాగమైన భార్యకూడా తన్నను మానిస్తోందా? తను నిరపరాధియని లోకం ఎందుకు సత్యాన్ని గ్రహించలేదు? తను భగవంతుడికేం అపకారం చేశాడు? ఆక్సెనోవ్ రెండు హస్తాల్తోటీ కళ్ళని గట్టిగా కప్పుకున్నాడు. హృదయంలో మిక్కిలిగా విలపించాడు. తనేమీ సమాధానం చెప్పలేకపోయాడు.

చంటిపిల్లవాడు ఇంటికి రమ్మని మారాం చేస్తున్నాడు. తన అవయవాల్ని బంధించిన గొలుసును చూచి ఏవగించుకున్నాడు. అతడు గడ్డం రెండు చేతులమధ్యా పట్టుకుని, తదేకంగా నేలవంక చూస్తున్నాడు. భార్య కొద్ది నిముషాలు అల్లాగే నిలబడిపోయింది. తరువాత అతడి మనస్సులోని ఆవేదన గ్రహించింది. శలవు తీసుకుని, భారమైన హృదయంతో మెల్లగా బయటకు నడిచింది.

ఆక్సెనోవ్ కొద్ది కాలంపాటు ఆ పట్టణంలోనే శిక్ష ననుభవించాడు. అతడిలో జీవం నశించింది. సతతం వేదనతో పరధ్యానంగా ఏదో యోచిస్తూ కాలం గడుపుతున్నాడు.

ఆక్సెనోవ్‌ను సైబీరియా పంపించారు. అతడు తనుచేసిన పాటుకు ప్రతిఫలంగా ముట్టచెప్పబడిన పైకంతో "పవిత్ర సన్యాసుల జీవిత చరిత్రలు" పుస్తకం కొనుక్కున్నాడు. అప్పుడప్పుడు అందులోని చరిత్రలు పఠించి, ధ్యాన తత్పరుడైపోతుంటాడు.

సైబేరియాలో ఇతడి వైఖరి ఎల్లరను ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఎవరితోటీ ప్రమేయం లేకుండా కాలం గడిపే యితడు ఒక హత్య చేయగల సమర్థుడేనా ?" అనిపించింది. కొద్ది కాలంలోనే అతడు అక్కడి జైలు అధికారుల అభిమానాన్ని చూరగొన్నాడు.

అక్కడి ఖైదీలందరూ అతడిని గౌరవించారు. తమ తమ తగాదాల నెప్పుడూ ఆక్సెనోవ్ వద్దనే తీర్చుకొనేవారు.

ఆక్సెనోవ్ అప్పుడప్పుడు చెప్పులు కుట్టేవాడు. మిగిలిన కాలంలో నిస్పృహగా, ఏదో ఆలోచిస్తూ గడిపేవాడు. ఒకరోజున అక్కడికి ఒక కొత్త ఖైదీల గుంపు వచ్చింది. అందులో ఒక వింతవ్యక్తి కూడా ఉన్నాడు. పాతఖైదీలందరూ క్రొత్తవారిని పరివేష్టించి, వారు సల్పిన నేరాలను తెలుసుకుంటున్నారు. అందులోని వింత వ్యక్తినికూడా ప్రశ్నించారు. అతడిపేరు సమరిచ్. అతను చెప్పిన కథ ఇది.

* * *

"నేనొక గుర్రాన్ని ఒక బండీనుంచి విప్పి తోలుకుపోయానని నాకు శిక్ష వేశారు. ఆ గుర్రాన్ని నేను వేగంగా ఇల్లు చేరుకునే ఉద్దేశ్యంతో తోలుకు పోయాననుకోండి, కాని, తరువాత దానిని వదలివేద్దామనే అనుకున్నాను. పైగా ఆ గుర్రపు బండివాడు నేనెరిగున్నవాడే. ఆవిధంగానే నేను కోర్టులో వాదించాను. కాని, లాభం లేకపోయింది." అతడికేసి అందరూ వింతగా చూశారు. అతడు వచ్చిన గ్రామం ఆక్సెనోవ్ స్వగ్రామమేనని తెలుసుకున్నాక, ఆక్సెనోవ్ ప్రశ్నించాడు.

"ఆక్సెనోవ్ అనే వర్తకుడి కుటుంబాన్నెరుగుదువా ? వాళ్ళు కులాసాగా ఉన్నారా ?"

"అవును. అతడిప్పుడు సైబీరియాలోనే ఉన్నాడట. అతడి పుత్రులు అధికంగా ధనవంతులయారిప్పుడు.".

"ఐతే అతడి నేరంలో నీ అభిప్రాయం ఏమిటి ?" అని ఆక్సెనోవ్ అడిగాడు.

సమరిచ్ సమాధాన మిచ్చాడు: "కత్తి అతని సంచీలో ఉందికనుక... అతడే... హంతకుడు. అంతే— పోనీ యితరులు అతడిసంచీలో పెట్టినా...... అదంతా అసంభవం— అతడే హంతకుడు."

తరువాత ఆక్సెనోవ్ తననెరిగించుకున్నాడు. అతడాశ్చర్యపోయి, "అరే! అప్పుడే ముసలివాడయిపోయావే!" అన్నాడు. ఇతర ఖైదీలతడిని "ఆక్సెనోవ్‌ను పూర్వం ఎరుగుదువా ?" అని అడిగారు. అతడేదో అనిశ్చితంగా ప్రత్యుత్తరమిచ్చాడు.

అతడే హంతకుడని ఆక్సెనోవ్ మనస్సులో ఒక అనుమానం జనించింది. అప్పటినుంచీ అతడి వేదన వృద్ధిపొందుతోంది.

కొంతకాలం జరిగింది. ఒకరోజు రాత్రి అతడు బల్లమీద పడుకుని నిద్రపోతున్నాడు. బల్లక్రింద ఏదో శబ్దం వినవస్తోంది. అతడు లేచి

చూచాడు. క్రింద నొక సొరంగంలో నుంచి ఒక మానవాకృతి వెలువడ్తోంది. అతడు తదేకంగా గమనించాడు. సమరిచ్ విగ్రహం అతని ముందు కనిపించింది. సమరిచ్ ఆక్సెనోవ్ గొంతు గట్టిగా పట్టుకుని అన్నాడు.

'నువ్వు గొడవ చేశావా, అధికారులు నన్ను చంపేస్తారు. యీలోగా నిన్నే హత్య చేసేస్తాను."

ఆక్సెనోవ్ సమరిచ్ పట్టు విడిపించుకుని, ప్రక్కకు నడిచాడు. "నేనికివరకే హత్య చెయ్యబడ్డాను."

"నిన్ను కారాగారానికి పంపింది నేనే. నేనే ఆ వర్తకుణ్ణి చంపింది. కాని,... ఫరవా లేదు. నేను బయటకొక సొరంగం త్రవ్వుతున్నాను. దాని ద్వారా నువ్వుకూడా పారిపోవచ్చు. రోజూ త్రవ్విన మన్ను బూట్లలోపోసి, ప్రొద్దుటే గోడ దగ్గర పోస్తూ వచ్చాను. ఈ సంగతి అధికారుల్తో చెప్పావా, నిన్ను బతకనియ్యను."

ఆక్సెనోవ్ విషాదంగా ఇలా అన్నాడు: "నేను పారిపోను. నేను 26 సం॥ శిక్ష ననుభవించాను. నా భార్య గతించి ఉంటుంది. నన్ను నా బిడ్డలు గుర్తించలేరు. (నా జీవితాన్ని నువ్వే నాశనం చేశావు) నాకింక బాహ్య ప్రపంచంలో అడుగిడే యోచన లేదు. నువ్వు వెళ్ళిపో ఇక్కణ్ణించి" ఆక్సెనోవ్ చివరిమాటలు ఉద్రేకంగా అన్నాడు.

సమరిచ్ అతణ్ణి భయపెట్ట చూశాడు. కాని, అతడు నిశ్చలంగా జవాబిచ్చాడు. తరువాత సమరిచ్ సొరంగంద్వారా వెళ్ళిపోయాడు.

"సమరిచ్ తన జీవితాన్ని ధ్వంసం చేశాడు. తన్ను తన దారాపుత్రులనుంచి యావజ్జీవంగా ఎడబాటు కల్పించాడు. అతడ్ని తిరిగి సాధించి తీరాలి" అని అతడి ఆత్మ ఘోషించింది. అతడికి రాత్రి నిద్దరపట్టలేదు. లేచి పచార్లు చేస్తున్నాడు ఇటూ అటూ. అతడి కళ్ళముందు దుఃఖించే తన భార్యా పిల్లలూ కనిపించారు. తరువాత వరుసగా అతడు అంతిమంగా గడిపిన ఉత్సాహపు గడియలు, అతడి కఠిన శిక్ష, 26 సంవత్సరముల కారాగారశిక్ష, అన్నీ ఒక్కటొక్కటే కళ్ళకు కట్టినట్లగుపించాయి. అతడి హృదయం ఉద్రేకంతో పొంగింది. ప్రతీకారం కోసం అతడి ఆత్మ పెనగులాడింది. అతడి రుధిరం ఉప్పొంగింది.

మరునాడధికారులు సొరంగం సంగతి తెలిసి, విచారణ సాగించారు. కాని, ఎవ్వరూ నేరాన్ని వప్పుకోనలేదు. అధికారులు ఆక్సెనోవ్‌ను అడిగారు ఆఖరు ప్రయత్నంగా "తాతా! నిజం చెప్తావు. నీకు తెలిసి ఉంటుంది చెప్పు."

అతడు జవాబిచ్చాడు "అందుకు భగవంతుడికంగీకారం లేదు. క్షమించండి. నన్ను శిక్షించండి. పాత్రుణ్ణి."

ఆ రాత్రి ఆక్సెనోవ్ గదిలోకి మెల్లిగా నడుస్తూ సమరిచ్ వచ్చాడు. అతడ్ని చూసేటప్పటికి ఆక్సెనోవ్‌కు ఏవగింపు కలిగింది. వెంటనే లేచి, ఉద్రేకంగా "సమరిచ్! నన్ను పూర్వమే హత్య చేశావు. పాప ఫలం అనుభవిస్తావు. నిన్ను భగవంతుడు క్షమించడు. వెళ్ళిపో తక్షణం! లేకపోతే అధికారుల్ని పిలుస్తాను."

అతడి మనస్సంతా వికారం అయిపోయింది. మొదట ఆలోచనలలో కరిగిపోయింది. అతడి ముఖంలో క్రౌర్యం స్పష్టమౌతుంది.

సమరిచ్ క్రమంగావచ్చి ఆక్సెనోవ్ పాదాలు పట్టుకున్నాడు. "ఆక్సెనోవ్! క్షమించు నన్ను. నువ్వింత ఉత్తముడివనుకోలేదు. అధికారులకు హత్య నేనే జరిపినట్లు తెలియజేస్తాను. వెంటనే నిన్ను విడుదల చేయిస్తాను. నన్ను క్షమించు!"

ఆక్సెనోవ్ మనసు ఊగులాడుతోంది. తన జీవిత నాశనానికి కారకుడైన వాడినా తను క్షమించటం! అతడి ఆత్మ విలవిలా తన్నుకుంది. అతడు తన తప్పు తెలుసుకున్నాడు. కాని; తన జీవితం పూర్వం ఎంత సుఖమయం - ఇప్పుడెంత దుఃఖమయం! నా అనేవాళ్ళెవరూ అతడికీ ప్రపంచంలో లేరు. తనను ప్రాణప్రదంగా ప్రేమించిన భార్యకి దూరమయాడు. భగవంతుడు సత్యస్వరూపుడు. అతడిని నమ్మాడా క్సెనోవ్!

క్షణాలో అతడి ముఖంలో శాంతం మూర్తీభవించింది. కళ్ళు అదరణను వెదజల్లుతున్నాయి. అప్రయత్నంగా అతడి నోటినుండి యీమాటలు వెలువడ్డాయి. "భగవంతుడు నిన్ను క్షమిస్తాడు."

మరునాడతనికి విడదల చెయ్యవలసిందిగా ఉత్తరువులు జారీ అయినాయి. అధికారి ద్వారం తెరచి గదిలోకి ప్రవేశించాడావార్త అతడిచెవిని వేసి విడుదల చేద్దామని. అతడా దృశ్యంచూసి నిశ్చేష్టుడై అలాగే నిలబడిపోయాడు.

"ఆక్సెనోవ్ శరీరం నిర్జీవంగా పడిఉంది.

****

వారేమవుతారు?

శ్రీమతి ఎస్. కే. రాజేశ్వరీరాణి

ఒక యువకుడు — ఒక స్త్రీ దారిన పోవుచుండ ఒక ముసలావె వారిని అడ్డగించి "వారేమవుతారు?" అని అడిగిందిట. అందుకాస్త్రీ "మా మామను ఇతని మామ "మామ" అని పిలుచును" అన్నదిట! అయిన వారేమవుతారు? అన్న సమస్యని ఆంధ్ర మహిళ పాఠకులకు శ్రీమతి డాక్టరు రావుగారు చక్కని మెదడుకు మేతగా పెట్టారు! చాలామంది ఆసమస్యని ఎలాపూరించాలా? అని తికమకపడుతుంటారు, పడివుంటారు. మా అన్నయ్య నిమిషంలో విడతీసేసాడు. మీకు చెప్పనామరి?

అనుకొందాం స్త్రీ పేరు రాధమ్మ, ఆ యువకుని పేరు బాబు.

రామయ్య చెల్లెలు రాధమ్మ, సౌభాగ్యమ్మనూ. సౌభాగ్యమ్మ కొడుకు బాబు. ఒకరోజు రాధమ్మా, బాబు అలా పోతున్నారు బజారుకో, షికారుకో.

కేశవయ్యగారి కొడుకు రామయ్య, కూతుళ్ళు రాధమ్మ, సౌభాగ్యమ్మ. ఆయనగారి సతీరత్నం శ్యామలమ్మ. శ్యామలమ్మకో అన్నదమ్ముడున్నాడు సామినాధమని.

ఇప్పుడు రాధమ్మ మామ సామినాధము. బాబు మామ రామయ్య. బాబు మామ రామయ్య సామినాధాన్ని మామా అనే పిలుస్తాడు!

రాధమ్మ అన్న మాటలు మా మామని ఇతని మామ అంటే సామినాధాన్ని బాబు మామ రామయ్య "మామా" అని పిలుస్తాడు! ఇంతేనా? అక్కకొడుకని చెప్పకుండా రాధమ్మ చిత్రంగా చెప్పింది జవాబు!